క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

భోగాపురం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ రవికుమార్ హెచ్చరించారు. భోగాపురం, రెడ్డి కంచేరులో ఉన్న మద్యం దుకాణాలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్డి కంచేరులో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మద్యం దుకాణాల వద్ద రెక్కీ నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే తమకి తెలియజేయాలని సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది ప్రతాప్, శిరీషా పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం

విజయనగరం: సమాచార హక్కు చట్టం 2005 పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగరంలోని వివిధ సచివాలయల పరిధిలో సమాచార హక్కు చట్టంపై కార్యదర్శులు సదస్సులు బుధవారం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం 2005 యొక్క ఆవశ్యకతను ప్రజలకు తెలియజేశారు. బ్యానర్లతో ప్రచారం చేసి సదస్సులు నిర్వహించి ప్రతి ప్రాంతంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా చేపడుతున్న కార్యకలాపాలు ప్రజలకు తెలియాలన్న ఉద్దేశంతో సమాచార హక్కును ప్రభుత్వం చట్టం రూపంలో తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం పట్ల మరింత చైతన్యం కలిగించేలా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



హెచ్ఐవీపై కరపత్రాల ద్వారా అవగాహన

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీపై ప్రతీ ఒక్కరు అవగాహన పెంచుకోవాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రతినిధి కె.గౌరి అన్నారు. స్థానిక లంకాపట్నంలో బుధవారం హెచ్ఐవీ ఎయిడ్స్‌పై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదన్నారు. వారి పట్ల ప్రేమ అప్యాయత చూపించాలన్నారు. హెచ్ఐవీ సోకని తర్వాత కంటే సోకక ముందు జాగ్రత్త వహించాలన్నారు. హెచ్ఐవీ రోగులు క్షయ పరీక్షలు చేయించాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నామని విద్యుత్ శాఖ డీఈఈ పి.త్రినాధరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించడంతో పాటు సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మధుపాడ, పిన తరిమి, పెద తరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

మరో సైబర్ మోసం..

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన ఓ యువతి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి నగదు పోగొట్టుకుంది. ఈ సంఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో జాబ్ ఆఫర్ అంటూ చెప్పి నేరగాళ్లు బాధితురాలి సెల్‌ఫోన్‌కు వాట్సాప్ ద్వారా లింక్ పంపించారన్నారు. ఈ లింక్ ద్వారా పలు దఫాలుగా 4,17,000 రూపాయలు స్వాహా చేశారని తెలిపారు. మోసపూరితంగా లింక్‌లు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

☛ ఇద్దరికి గాయాలు..

ఓ ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ పట్టణంలో ఆగి ఉన్న మరో ఆటోను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణమూర్తి తెలిపారు.

మట్టి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు

గంట్యాడ: ఎక్కడైనా మట్టి తవ్వకాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

- తాగునీటి పైప్‌లైన్‌ల నిర్వహణ పేరిట కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేస్తున్న వైనం
- నగర ప్రజల రాకపోకలకు తప్పని ఇబ్బందులు

తవ్వేస్తారు.. వదిలేస్తారు...



కోట జంక్షన్ సమీపంలోని ఎస్‌బీఐ వద్ద పైప్‌లైన్ ఇంటర్ లింక్ పనులు పేరిట తవ్వి వదిలేసిన చిత్రం

విజయనగరం: జిల్లా కేంద్రమైన విజయనగరంలో ప్రజలు, వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం జనసంచారం ఉండే ప్రధాన మార్గాల్లో పెద్ద పెద్ద గుంతలు తవ్వి వదిలేయటంతో అటుగా రాకపోకలు సాగించే వారు నరకయాతన అనుభవిస్తున్నారు. 50 డివిజన్‌లలో విస్తరించి ఉన్న విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 3 లక్షలకు పైగా జనాభా ఉన్నారు. వివిధ అవసరాల నిమిత్తం వచ్చే వారి వాహనాలు, జనాభా సంఖ్య ప్రతి రోజు 50వేల వరకు ఉంటుంది. అదే పండగలు సీజన్ అయితే ఈ సంఖ్య రెండింతలు రెట్టింపవుతుంది. ఇటువంటి ప్రధాన నగరంలో నిత్యం గుంతలు తవ్వి వాటిని నెలల తరబడి పూడ్చకుండా వదిలేయటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాగునీటి పైప్‌లైన్‌ల నిర్వహణ పేరిట రోడ్లపై గుంతల తవ్వి వదిలేయటం అలవాటుగా మారిందని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కార్పొరేషన్ అధికారులు పర్యవేక్షించకపోవటం గమనార్హం. గుంతలు తవ్విన చోట సదరు కాంట్రాక్టర్‌లు ఎటువంటి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయకపోవటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

3 నెలలుగా ఇలానే వదిలేశారు...

నగరంలో కోట జంక్షన్ సమీపంలో గల ఎస్‌బీఐ ఫోర్ట్ బ్రాంచి వద్ద 3 నెలల క్రితం తవ్వి వదిలేసిన పలకలు అమర్చకపోవటంతో అటుగా రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి పైప్‌లైన్‌ల ఇంటర్ లింక్ పనుల పేరిట ఓ కాంట్రాక్టర్ సిబ్బందితో కాలువపై ఉన్న పలకలు తొలగించి పనులు చేపట్టారు. అనంతరం కాంట్రాక్టర్ పట్టించుకోకపోవటంతో స్థానికులే స్వచ్ఛందంగా మరమ్మతులు చేపట్టారు. పనులు జరిగి అంతా సవ్యంగా ఉందనుకున్న కొద్ది రోజుల్లోనే ఆ కాంట్రాక్టర్ వచ్చి ఎవ్వరికీ సమాచారం ఇవ్వకుండా మళ్లీ తవ్వకాలు చేపట్టారు. దీంతో స్థానికులు కాసింత అసంతృప్తి వ్యక్తం చేయగా...ఈ ప్రాంతం నుంచి వెళ్లే పైప్‌లైన్‌ల మరమ్మతులు చేయాల్సి ఉందని అందుకే తవ్వుతున్నామని కాంట్రాక్టర్ సమాధానమిచ్చారు. పనులు ముగిసిన వెంటనే తామే మరమ్మతులు చేపడతామంటూ హామీ ఇచ్చి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటికీ పట్టించుకోకపోవటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.

మూడులాంతర్ల జంక్షన్ సమీపంలో...

నగరంలోని మూడులాంతర్ల జంక్షన్ సమీపంలో గల ప్రధాన మార్గంలో కార్పొరేషన్ పేరిట గుంతల తవ్వి వదిలేశారు. నిత్యం ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పనులు పూర్తయిన తరువాత మరమ్మతులు చేపట్టకపోవటంతో ప్రమాదాల నిలయంగా మారింది. వాస్తవానికి నగరంలో ఈ తరహా మరమ్మతులు చేపట్టేటప్పుడు టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ యథావిధిగా సరి చేయాల్సి ఉంటుంది. అయితే సంబంధిత అధికారులు తమకు కావాల్సిన పనులు పూర్తయిన తరువాత పట్టించుకోవటం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కాంట్రాక్టర్‌లు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇటువంటి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని నగర వాసులు కోరుతున్నారు.



మూడులాంతర్ల జంక్షన్ సమీపంలో ప్రధాన మార్గంలో ఇదీ పరిస్థితి

అద్దె చెల్లించని దుకాణాల సీజ్



విజయనగరం కార్పొరేషన్ ఆధీనంలో ఉన్న దుకాణాల అద్దెలను సకాలంలో చెల్లించాల్సిందేనని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు. దీర్ఘకాలికంగా అద్దె బకాయిలు చెల్లించని న్యూ ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌లో మూడు దుకాణాలను బుధవారం రెవెన్యూ సిబ్బంది సీజ్ చేశారు. చాలాకాలంగా అద్దె బకాయిలు పేరుకుపోవడంతో సదరు దుకాణ యజమానులకు నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో చర్యలు చేపట్టారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది ఆయా దుకాణాలను మూసివేసి త్వరితగతిన అద్దెలు చెల్లించాలని చెప్పారు. - విజయనగరం

అధికారులకు నిర్ణయాధికారం లేకపోతే ఎలా!

- లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ

విజయనగరం గంటస్తంభం: రాష్ట్ర ముఖ్యమంత్రి స్వర్ణాంధ్ర సాధనకు సంకల్పం పేరుతో ఈ నెల 21, 22, 23 తేదీల్లో ప్రవేశపెట్టిన అధికారుల పల్లెబాట కార్యక్రమం మంచిదే అయినా సమస్య పరిష్కారానికి స్థానికంగా పరిశీలన చేసిన అధికారికి అధికారం లేకుండా పల్లెబాట కార్యక్రమం నిర్వహించడం వలన ఫలితం ఉండదని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆయన బుధవారం మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో పాటుగా వివిధ శాఖాధిపతులు పల్లెలో స్థానిక సచివాలయంలోగాని, అంగన్‌వాడీ కేంద్రంలోగాని, పాఠశాల భవనంలోగాని రెండు రాత్రులు నిద్ర చేస్తారని, మూడు పగళ్లు అక్కడే ఉండి ప్రజల సాధకబాధలు తెలుసుకుంటారని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. గ్రామంలో సమస్యలను వెను వెంటనే నిర్ణయాలు తీసుకునే అధికారం పల్లెలో పర్యటించే వారికి లేకపోతే స్వర్ణాంధ్ర సంకల్పం నెరవేరదని భీశెట్టి అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వంలోని చాలా శాఖల్లో సిబ్బంది లేని పరిస్థితి నెలకొందని ప్రజలకు శాంతియుతంగా సమాధానం చెప్పే అధికారులు సంఖ్య తగ్గిందని అన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రతినిధి అల్లంశెట్టి నాగభూషణం, పౌర వేదిక కార్యదర్శి తుమ్మగంటి రాంమోహన్‌రావు పాల్గొన్నారు.

పరిసరాలను అపరిశుభ్రం చేస్తే చర్యలు తప్పవు

విజయనగరం: స్క్రాప్ దుకాణాలు నిర్వాహకులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, లేకుంటే చర్యలు తప్పవని విజయనగరం కార్పొరేషన్ ప్రజారోగ్యాధికారి కె.సాంబమూర్తి స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న స్క్రాప్ దుకాణాలను పారిశుధ్య పర్యవేక్షకులు షాలెం రాజ్, రమేష్ రెడ్డి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. దుకాణాల సమీపంలో వ్యర్థాలు చెల్లాచెదురుగా పడి వుండడాన్ని గమనించి దుకాణ యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్క్రాప్ దుకాణాల వద్దకు అనేక వ్యర్థ వస్తువులు వస్తుంటాయని వాటిని రహదారుల పైన పరిసర ప్రాంతాలలో పడవేయకుండా జాగ్రత్తలు పాటించాల్సిన బాధ్యత స్క్రాప్ దుకాణ యజమానులదేనని అన్నారు. తాము ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి స్క్రాప్ దుకాణాలను పరిశీలిస్తున్నామన్నారు. పలుమార్లు చెప్పినప్పటికీ కొంతమంది స్క్రాప్ దుకాణ నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఇకపై స్క్రాప్ దుకాణాలు పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



దుకాణ నిర్వాహకులతో మాట్లాడుతున్న ప్రజారోగ్య సిబ్బంది

సామాజిక సేవలే స్ఫూర్తినిస్తాయి..

విజయనగరం టౌన్: సామాజిక సేవలే స్ఫూర్తినిస్తాయని, అవార్డులు, పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయని అహల్యభాయ్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ ఎమ్ఎస్.స్వరూప్ పేర్కొన్నారు. స్థానిక అంబటి సత్రం వద్దనున్న యేసు ప్రేమాలయం ఆవరణలో బుధవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన పాల్గొన్నారు. ట్రస్ట్‌కు ఇటీవల ఇండో యూరోపియన్ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించడం పట్ల సభ్యులు అభినందించి స్వరూప్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని అనాథ పిల్లలకు ఆశ్రయం కల్పించి ఆదుకోవడంతో పాటూ తలసీమియా రోగులకు ఉచిత స్వచ్ఛంద రక్తదానం, కేన్సర్ రోగులకు నిరంతరం మందుల పంపిణీ, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మందులను ఉచితంగా అందించడం వంటి కార్యక్రమాలను నిర్విరామంగా చేస్తూ ఉండడంతో అవార్డు లభించిందన్నారు. ఈ ప్రోత్సాహంతోనే ట్రస్ట్ సేవా కార్యక్రమాలను మరింత విస్తతంగా నిర్వహిస్తామన్నారు. రెవరెండ్ ఇమ్మానియేల్ దైవ సందేశాన్ని అందజేశారు. చర్చి పాస్టర్ అలజంగి రవికుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్టీఫెన్ పాల్సన్, వివేకానంద, నిర్మల, సువర్ణ, జాకబ్, కె.సూర్యనారాయణ, విన్స్టన్, ఏసుదాస్, విక్టర్‌బాబు, విద్యాసాగర్, సువార్తమ్మ, శశికళాదేవి, రమ్య తదితరులు పాల్గొన్నారు.



చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు స్వరూప్‌ను సత్కరిస్తున్న యేసు ప్రేమాలయం చర్చి నిర్వాహకులు

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌తో పెట్టుబడిదారులకు ప్రయోజనం

- జిల్లాలో మూతబడిన పరిశ్రమలను మంత్రి కొండపల్లి తెరిపించాలి
- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్

విజయనగరం గంటస్తంభం: దేశంలో పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ విమర్శించారు. వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కోట జంక్షన్ వద్ద ఈ నెల 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా జీపు జాతా ముగింపు కార్యక్రమం సీఐటీయూ నగర అధ్యక్షుడు ఎ.జగన్మోహనరావు అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ కనీస వేతనం అమలు, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల, స్కీముల్లో పని చేసే వారిని కార్మికులుగా గుర్తించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ రద్దు, సమాన పనికి సమాన వేతనం తదితర విషయలపై ఈ నెల 20న సమ్మె చేయాలని కార్మిక, ఉద్యోగ సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. నాలుగు లేబర్ కోడ్స్ చట్టాలు తెచ్చి కార్మికులపై మోదీ ప్రభుత్వం ఉరితాడు బిగిస్తోందన్నారు. జాతి ప్రయోజనాలకు వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం విద్యుత్, రవాణా, బ్యాంకులు, ఇన్సురెన్స్, స్టీల్ తదితర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. కార్పొరేట్ శక్తులకు రూ.వేల కోట్లు మోదీ ప్రభుత్వం రుణ మాఫీ చేస్తుందని దుయ్యబట్టారు. మోదీ పాలనలో నిత్యాసరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి రోజుకు రూ.600 ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. 20న తలపెట్టిన సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమ్మెలో 17 డిమాండ్లు కేంద్ర ప్రభుత్వం ముందు ఉంచామన్నారు. జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మూసి వేసిన పరిశ్రమలను తెరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు రెడ్డి శంకరరావు, పైడిరాజు, పాపారావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



జీపు జాతా ముగింపు సభలో మాట్లాడుతున్న సురేష్

ఎస్సీ కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక వాయిదా

భోగాపురం: ఎస్సీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులకు జరగనున్న ఇంటర్వ్యూలను వాయిదా వేసినట్టు ఎంపీడీవో కిషోర్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 16న భోగాపురం ఎంపీడీవో కార్యాలయం ఇంటర్వ్యూల ప్రక్రియ నిర్వహించాల్సి ఉందని, కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేశామన్నారు. ఇంటర్వ్యూలు ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలో అధికారికంగా ప్రకటిస్తామని, లబ్ధిదారులు గమనించాలని కోరారు.

విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యం



గురజాడ స్వగృహంలో ఆయన చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి దేశభక్తి గీతాలాపన చేస్తున్న సంస్థ ప్రతినిధులు, చిన్నారులు

- వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన డాక్టర్ స్వప్న హైందవి

విజయనగరం టౌన్: విద్యార్థులకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు, సమాజం పట్ల అవగాహన పెంపొందించే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి అన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులకు నైతిక విలువలు, సంస్కృతీ, సంప్రదాయాలు పట్ల కనీస అవగాహన లేకుండా పోయిందని పేర్కొన్నారు. విద్యార్థులకు విద్యతో పాటూ వినయం, సంస్కారం నేర్పించేందుకు వాగ్దేవీ సమారాధనం, తెలుగు భాషా పరిరక్షణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో గురజాడ స్వగృహంలో చేపట్టిన వేసవి ఉచిత శిక్షణ తరగతులను బుధవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాగ్దేవీ బాల సంస్కార శిక్షణ తరగతులకు విద్యార్థులను తల్లిదండ్రులు తప్పనిసరిగా పంపించాలని కోరారు. సంస్కారవంతమైన విద్యతోనే పరిపూర్ణ సమాజం సాధ్యమవుతుందని తెలుగు భాషా పరిరక్షణ సమితి కార్యదర్శి డాక్టర్ జక్కు రామకృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శతక పద్యాలపై అవగాహన కల్పించారు. అనంతరం మహాకవి గురజాడ అప్పారావు జీవిత విశేషాలను, సాహిత్య వైభవాన్ని గురజాడ ఇందిర వివరించారు. కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్, టేకుమళ్ల విజయలలిత, రవికుమార్ ఆచార్యులు, రాంభట్ల సన్యాసిరాజు శర్మ, పప్పు సావిత్రి, రేపల్లె ఈశ్వరరావు, మానాప్రగడ వంశీ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాలను రద్దు చేయడం తగదు

దత్తిరాజేరు: ఈ నెల 20న కార్మిక సంఘాలు చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ అన్నారు. కోమటిపల్లి ఆటోస్టాండ్ వద్ద ఉపాధ్యక్షురాలు లక్ష్మితో కలిసి బుధవారం ఆయన మాట్లాడుతూ.. కార్మికుల పొట్ట కొట్టడానికి 42 కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు రావడం మోదీ ప్రభుత్వానికి తగదన్నారు. బ్యాంక్‌లు, ఎల్ఐసీలు, రైల్వే, పోస్టల్, విశాఖ స్టీల్‌ప్లాంట్ సహా అన్న రంగాలనూ ప్రైవేట్ పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకోకపోతే ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.



మాట్లాడుతున్న సీఐటీయూ ప్రధాన కార్యదర్శి సురేష్





క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యానికి దోహదపడతాయనడంలో సందేహం లేదు. వేసవి సెలవుల నేపథ్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని వివిధ క్రీడా మైదానాల్లో తైక్వాండో శిక్షణ ఇస్తున్నారు. కస్పా హైస్కూల్‌లో తైక్వాండో ఎయిర్‌లో కిక్ కొడుతున్న క్రీడాకారులను చూడొచ్చు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం